# రచనాదక్షతగల లక్ష్మీకాన్తమ్మ

- డాక్టర్ ద్వానాశాస్త్రి

"చదవకుండా, శ్రమపడకుండా వెంటనే కీర్తిరావాలి అనుకుంటున్నారు ఈ తరం. అలా వచ్చిన కీర్తి నిలవదు. ఎన్నేళ్ళు తపనపడితే ఓ మంచి కావ్యం వస్తుంది? ఇప్పుడు శాశ్వతమైన విలువల కోసం రచనలు చెయ్యడం తక్కువైపోయింది. ఇది కాలధర్మం అనుకోవాలి".

అని పదేళ్ళ క్రితం ముఖాముఖిగా తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారు. నాళం కృష్ణారావుగారి కుమార్తెగా మొదట్లో పేరు సంపాదించుకున్నా, ఆ తర్వాత పాండిత్యం సంపాదించి, పరిశోధనపై మనసు మళ్ళించి సాహిత్య ప్రపంచంలో తన కాళ్ళపై నిలబడ్డారు. ఆతరం (1917లో జన్మించారు) స్త్రీలు ఇంత 'విచ్చలవిడి'గా రచనలు చెయ్యడం చాలా అరుదు. అలా చేసే స్వేచ్ఛ కూడా వుండేది కాదు. పైగా సాంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిన వాళ్ళకి ఆ వెసులుబాటు తక్కువే. అయితే లక్ష్మీకాన్తగారి అదృష్టంకొద్దీ హయగ్రీవగుప్తాగారు భర్తగా దొరికారు. ఆయన లక్ష్మీ కాన్తంగార్కి పూర్తి రచనా స్వేచ్ఛ ఇచ్చారు. "మావారు నేను ఏం రాసినా, ఎక్కడికి వెళ్ళినా, ఎంతగా పుస్తకాల పురుగునైనా నా మీద కసురుకునేవారు కాదు - అదే నాకు సహకారమైంది" అనేవారు.

లక్ష్మీకాన్తంగారు ఏలూరులో పుట్టినా రాజమండ్రిలోనే పెరిగారు. నాళం కృష్ణారావుగారి అంశ ఈమెలో బలంగా వుంది. సంస్కృతాంధ్రాలలో మంచి పాండిత్యం సంపాదించారు. ఉభయ భాషాప్రవీణురాలైంది. ఆధ్యాత్మిక జ్ఞానం అలవడింది. "విద్వత్కవయిత్రీ తిలక" వంటి బిరుదులు చాలా లభించినా జమ్మలమడక మాధవరామశర్మగారి ఈ మాటల్ని అసలైన బిరుదు'గా గ్రహించాలి. "పేరులో, వాక్కులో, భావములో, సమాజములో, ధర్మములో, గృహములో లక్ష్మీకాన్తమ్మ కొంత స్వభావ, జిగిబిగి చేర్పుకూర్పుకల పొందిక ప్రియ భంగురము, స్వస్పంద సుందరము, భావభర భాసురము అయిన యొకానొక భాష తనకై తాను సృష్టించుకొనెను. వీణా వేణునాట్యభాషావిద్యాగీత సంగీత విశేషాభిజ్ఞయగుటలో హయగ్రీవ గుప్తాంగీకారమె సర్వహేతువు".

లక్ష్మీకాన్తమ్మగారిని చాలామంది కవయిత్రిగా ప్రశంసిస్తారు. పద్యకవిత్వంలో - దానికంటే గేయ కవిత్వంలో ఆమె సిద్ధహస్తురాలే. దేశభక్తిని ప్రబోధిస్తూ మంచి కవితలు మాత్రాఛందస్సులో రాశారు. స్త్రీల సాహసాన్ని, త్యాగాన్ని, అనురాగాన్ని వివరిస్తూ కవిత్వం రాశారు. అయితే ఎందుకోగానీ లక్ష్మీకాన్తమ్మగారిని 'కవయిత్రి'

అనటం కంటె పరిశోధకురాలు, విమర్శకురాలు అనటమే సమంజసమనిపిస్తుంది.

''అఖిలభారత కవయిత్రులు'', ''ఆంధ్ర కవయిత్రులు'' అనే గ్రంథాలు లక్ష్మీకాన్తమ్మగారిని పరిశోధకురాలిగా నిరూపిస్తాయి. "ఆంధ్రుల కీర్తన వాఙ్మయసేవ' ' అనే ఒక్క పుస్తకం చాలు ఆమె మంచి విమర్శకురాలని చెప్పటానికి. భారత కవయిత్రులు గురించి, తెలుగులోని కవయిత్రులు గురించి మొట్టమొదటగా పుస్తకం రాసిన ఖ్యాతి ఈమెకే దక్కుతుంది. నలభై అయిదు సంవత్సరాల క్రితమే కవయిత్రుల జీవితం - రచనలపై సమీక్షాగ్రంథం రాయటం ప్రశంసనీయమే. రెండు వందల మంది కవయిత్రుల వివరాలు సేకరించి సమీక్షించడం మామూలు పనికాదు. దానికి ఎంతో పట్టుదల, ఓపిక, ఆసక్తి వుండాలి, ఏ సంస్థలోనో చెయ్యవలసిన పని అది. లక్ష్మీకాన్తమ్మగారు సంగీత శాస్త్రంలో కూడా అభినివేశం మాత్రమే కాదు. పాండిత్యం కూడా కలిగి వున్నారు. దానికి సాక్ష్యం "ఆంధ్రుల కీర్తన వాఙ్మయ సేవ'' అనే పుస్తకం ఇందులోవాగ్గేయకారుల గురించి మాత్రమే కాకుండా "పదములు - జావళీలు'' "తత్త్వములు - సంకీర్తనములు'', "స్త్రీల కీర్తన వాఙ్మయము'', "బ్రహ్మ సమాజ కీర్తనలు - హరికథా వాఙ్మయమూ'' మొదలైన అంశాలను విశ్లేషించారు. ఆమె సునిశిత పరిశీలనా దృష్టికి ఈ విమర్శ, ఉదహరణగా నిలుస్తుంది. పదవాఙ్మయ శాఖలు, పీఠాలు ఏర్పడకముందే "ఆంధ్రులకు గర్వకారణమైనట్టిదియు ప్రథిత భారతీయ, సాహిత్యములలో నొకటియై వాసిగాంచుచున్నట్టియునో తెలుగు సారస్వతమునందలి కీర్తన, లేక కృతి అను పేరుగల పదవాఙ్మయ శాఖ సహా విశిష్టమైనది'' అని గుర్తించి ప్రచారం చేసిన కళోపాసకురాలు లక్ష్మీకాన్తమ్మగారు. ఇటీవలే వీరు మరణించారు.

"మనం మస్తిష్కంగల
మాన్యమూర్తులం
ఈ మాన్య ధరిత్రీమాత ప్రసవిం
చిన మహా పవిత్రమూర్తులం''

అని దేశభక్తిని చాటిన లక్ష్మీకాన్తమ్మగారు తొలితర కవయిత్రులలో, పరిశోధకులలో ముందువరసలోనే వుంటారు.